క్లుప్తంగా

ఎంపీడీవోగా రమేశ్



ఎంపీడీవోను సన్మానిస్తున్న సిబ్బంది

కౌటాల: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవోగా బుద్దె రమేశ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వేసవిలో నీటి ఎద్దడి లేకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవోను సన్మానించారు.

ఈదురుగాలులతో వర్షం



సుంగాపూర్‌లో విద్యుత్ తీగలపై పడిన చెట్టు

తిర్యాణి: మండలంలోని సుంగాపూర్, గిన్నెదరి, రాళ్ల కన్నెపెల్లి, గడలపెల్లితో పాటు వివిధ గ్రామాల్లో శుక్రవారం ఈదురుగాలులతో కూడిన రాళ్ల వర్షం కురిసింది. గాలివానకు పలుచోట్ల చెట్లు నేలకొరిగి విద్యుత్ తీగలపై పడటంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో పాటు మామిడి కాత నేలమట్టమైంది.

'ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయండి'



వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు

కెరమెరి: ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని దేవాపూర్ గ్రామానికి చెందిన దివ్యాంగులు రాథోడ్ యశ్వంత్‌రావు, రాథోడ్ గజానంద్ అధికారులను కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో సిబ్బందికి వినతిపత్రం సమర్పించారు. తాము పూర్తిస్థాయిలో అర్హులు అయినప్పటికీ కమిటీ సభ్యులు తమ పేర్లను ఎంపిక చేయలేదని ఆరోపించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.

కొనసాగుతున్న అంబలి పంపిణీ



అంబలి పంపిణీ చేస్తున్న దేవార వినోద్

రెబ్బెన: వేసవి ఎండల తీవ్రత దృష్టిలో పెట్టుకుని ఇందిరానగర్ కనకదుర్గాదేవి ఆలయ అర్చకులు దేవార వినోద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత అంబలి పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. శుక్రవారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద అంబలి పంపిణీ చేపట్టగా పనులు నిమిత్తం మండల కేంద్రానికి వచ్చిన గ్రామాల ప్రజలతో పాటు చిరు వ్యాపారులు, వర్తకులు, కూలీలు అంబలిని సేవించి దాహార్తి తీర్చుకున్నారు. వర్షాలు ప్రారంభమయ్యే వరకు అంబలి పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందని దేవార వినోద్ అన్నారు.

నేడు భూ భారతిపై అవగాహన

తిర్యాణి: ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన భూ భారతి -2025 రెవెన్యూ చట్టంపై మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సూర్యప్రకాశ్ తెలిపారు. ఈ సదస్సుకు జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రేతో పాటు ఇతర జిల్లాస్థాయి అధికారులు పాల్గొంటున్నారని తెలిపారు. రైతులు పెద్దఎత్తున హాజరు కావాలని సూచించారు.

ఎస్సైకి సన్మానం



ఎస్సైని సన్మానిస్తున్న ఆదివాసీలు

కెరమెరి: ఇటీవల కెరమెరి ఎస్సైగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎస్సై మధుకర్‌ను శుక్రవారం ఆదివాసీ, మాలి సంఘాల నేతలు పోలీస్‌స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. రాయిసెంటర్‌ను గౌరవిస్తూ, ఆదివాసీల సివిల్ సమస్యలను మొదటగా రాయిసెంటర్‌లలో పరిష్కారమయ్యే విధంగా కృషి చేయాలని కోరారు. ఆదివాసీ నాయకులు మాజీ ఎంపీపీ పెందోర్ మోతిరాం, నాయకులు ఆనంద్‌రావు, ఆత్రం బొజ్జిరావు, సిడాం జగన్నాథ్, రఘునాథ్, తుకారాం, మాలి సంఘం నాయకులు సోనేరావు, తిరుపతి, సుధాకర్, శ్రావన్, సురేందర్, మహేశ్, సుభాశ్ తదితరులు ఉన్నారు.

బాలికలకు బాసట

- కేజీబీవీ విద్యార్థినులకు ఆన్‌లైన్ శిక్షణ
- సబ్జెక్ట్ నిపుణులతో తరగతుల నిర్వహణ
- ఇంటర్ తర్వాత ప్రవేశ పరీక్షలకు సన్నద్ధమయ్యేలా బోధన
- జిల్లాలో 105 మంది హాజరు



విద్యార్థినులకు మెటీరియల్ అందజేస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్: రాష్ట్రంలోని కస్తూరిబా గాంధీ విద్యాలయాల్లో ఇంటర్ పూర్తి చేసుకున్న బాలికలు ప్రవేశ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఆన్‌లైన్ శిక్షణ ఇస్తుంది. తల్లిదండ్రులు లేని, సింగిల్ పేరెంట్ నిరుపేద బాలికలే ఎక్కువగా కేజీబీవీల్లో విద్యనభ్యసిస్తుంటారు. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు వసతితో కూడిన విద్యను కేజీబీవీలు బాలికలకు అందిస్తున్నాయి. కేజీబీవీల్లో ఇంటర్ పూర్తయిన విద్యార్థులను ఉన్నతస్థాయిలో నిలబెట్టాలనే ఉద్దేశంతో వేసవి సెలవుల్లో సైతం బాలికలకు ఇంజినీరింగ్, వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ శిక్షణ ఇస్తున్నారు.

జూమ్ ద్వారా శిక్షణ..

ఈ ఏడాది నుంచి రాష్ట్ర ప్రభుత్వం కేజీబీవీల్లో చదివే పేద బాలికలకు ఉచితంగా నీట్, డైట్‌సెట్, ఎంసెట్‌ల కోసం ఆన్‌లైన్ శిక్షణ ఇస్తుంది. సైన్స్ గ్రూప్ కలిగిన జిల్లాలోని ఏడు కేజీబీవీలు రెబ్బెన, దహెగాం, చింతలమానెపల్లి, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, సిర్పూర్ (యూ), కెరమెరి కేజీబీవీల్లో బైపీసీ, ఎంపీసీ చదువుతున్న 105 మంది విద్యార్థులు శిక్షణ తీసుకుంటున్నారు. ఎంపీసీ లేదా బైపీసీ గ్రూప్‌లో ఇంటర్ పూర్తి చేసి ఇంజినీరింగ్, బీఎస్సీ నర్సింగ్, బీఎస్సీ అగ్రికల్చర్‌పై ఆసక్తి ఉన్న బాలికలకు ఎంసెట్‌పై ఆన్‌లైన్‌లో కోచింగ్ ఇస్తున్నారు. జూమ్ యాప్ ద్వారా హైదరాబాద్ కేంద్రంగా ఆయా సబ్జెక్టుల సీనియర్ అధ్యాపకులు, నిపుణుల ద్వారా గణితం, భౌతిక, రసాయన, వృక్ష, జంతుశాస్త్రాలపై తరగతులు నిర్వహిస్తున్నారు.

ఆన్‌లైన్‌లోనే పరీక్షలు..

రోజూ ఉదయం 5.30 గంటల నుంచి 10.30 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు జూమ్ యాప్ ద్వారా ఉచిత శిక్షణ ఇస్తున్నారు. సబ్జెక్టు టీచర్లు రోజూ విద్యార్థుల హాజరును పరిశీలిస్తున్నారు. యాప్‌లో ఎంత మంది హాజరవుతున్నారో పర్యవేక్షిస్తున్నారు. విద్యార్థులకు ఏవైనా సందేహాలు వస్తే నివృత్తి చేస్తూ వారం రోజులకు ఒకసారి ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. పుస్తకాలు అవసరమైన వారికి సంబంధించిన కేజీబీవీల నుంచే పుస్తకాలు సైతం అందజేస్తున్నారు.

నీట్ కోసం సన్నద్ధమవుతున్న..



ఆసిఫాబాద్ కేజీబీవీలో నేను బైపీసీలో ఇంటర్ సెకండియర్ పూర్తి చేశాను. ఇటీవల వచ్చిన ఇంటర్ ఫలితాల్లో 923 మార్కులు సాధించాను. నేను నీట్ కోసం సన్నద్ధం అవుతున్నాను. రోజు జూమ్ యాప్ ద్వారా శిక్షణ తీసుకుంటున్నాను. చాలా బాగా శిక్షణ ఇస్తున్నారు.

- మానస, విద్యార్థిని

ఉచిత శిక్షణ బాగుంది..



నేను ఆసిఫాబాద్ కేజీబీవీలో ఇంటర్ బైపీసీ పూర్తి చేశాను. మాది కాగజ్‌నగర్‌లోని అంకుసాపూర్ గ్రామం. రోజూ జూమ్ యాప్ ద్వారా శిక్షణ తరగతులకు హాజరవుతున్నాను. బీఎస్సీ నర్సింగ్, బీఎస్సీ అగ్రికల్చర్ ప్రవేశ పరీక్షల కోసం సన్నద్ధమవుతున్నాను. బయట శిక్షణ తీసుకునే స్థోమత లేదు. ఉచిత శిక్షణ బాగుంది.

- మహేశ్వరి, విద్యార్థిని

నిత్యం పర్యవేక్షణ

కేజీబీవీల్లో ఎంపీసీ, బైపీసీ పూర్తి చేసుకుని ఉత్సాహంగా ఉన్న సుమారు 105 మంది బాలికలకు రోజువారీగా జూమ్ యాప్ ద్వారా ఉచిత శిక్షణ కల్పిస్తున్నాం. విద్యార్థుల హాజరుపై నిత్యం పర్యవేక్షిస్తున్నాం.

- భాగ్యలక్ష్మి, కేజీబీవీ ఎస్‌వో

ఉగ్రదాడికి నిరసనగా నల్లబ్యాడ్జీలతో నమాజ్



రెబ్బెన: చేతులకు నల్లబ్యాడ్జీలు కట్టుకుని నిరసన తెలుపుతున్న ముస్లింలు



సిర్పూర్ (టి): నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు

రెబ్బెన: కాశ్మీర్‌లోని పహాల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని నిరసిస్తూ శుక్రవారం మండలంలోని ముస్లింలు నల్లబ్యాడ్జీలు ధరించి నమాజ్ చేశారు. ఈ సందర్భంగా పహాల్గాం దాడిని ఖండిస్తూ నినాదాలు చేశారు. పహాల్గాం ఉగ్రదాడిలో చనిపోయిన అమాయకుల ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఉగ్రదాడికి పాల్పడిన వారిని పట్టుకుని కఠిన శిక్ష విధించాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, మత పెద్దలు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): జమ్మూకాశ్మీర్ పహాల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడులను నిరసిస్తూ శుక్రవారం సిర్పూర్(టి) మేజరు గ్రామపంచాయతీ పరిధిలోని ముస్లింలు ప్రత్యేక ప్రార్థనల అనంతరం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. పర్యాటకుల ప్రాణాలు తీసిన ఉగ్రవాదులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు, యువకులు పాల్గొన్నారు.

'ఉగ్రమూకలను అంతమొందించాలి'



కొవ్వొత్తుల ర్యాలీలో సభ్యులు

దహెగాం: అమాయక ప్రజలను చంపిన ఉగ్రవాదులను అంతమొందించాలని భజరంగ్‌దళ్, విశ్వహిందు పరిషత్ నాయకులు అన్నారు. ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ శుక్రవారం మండల కేంద్రంలో శివాజీ విగ్రహం నుంచి ఎల్లమ్మ గుడి వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. భారత్ మాతాకీ జై అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. మండలంలోని గిరవెల్లి గ్రామ యువకుల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. భజరంగ్‌దళ్, విశ్వహిందు పరిషత్ సభ్యులు, యువకులు, వ్యాపారులు పాల్గొన్నారు.

రద్దయిన రైళ్లు పునఃప్రారంభమెప్పుడో?

- లాక్‌డౌన్‌తో రద్దయిన నాగ్‌పూర్ ప్యాసింజర్
- థర్డ్‌లైన్ పనులతో భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్..
- ప్రయాణికులకు తిప్పలు



సిర్పూర్(టి) రైల్వేస్టేషన్

సిర్పూర్(టి): సిర్పూర్(టి) రైల్వేస్టేషన్ నుంచి కొనసాగే పలు రైళ్లు రద్దయ్యి ఏళ్లు గడుస్తున్నా పునఃప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో ఇక్కడి నుంచి ప్రయాణాలు సాగించే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సిర్పూర్(టి) నుంచి మహారాష్ట్రకు, హైదరాబాద్‌కు వెళ్లేందుకు రైళ్ల సౌకర్యం లేకపోవడంతో కాగజ్‌నగర్ పట్టణానికి వెళ్లి ప్రయాణాలు సాగిస్తున్నారు. సిర్పూర్(టి) రైల్వేస్టేషన్ నుంచి కాజీపేట్ -బల్లార్షా రామగిరి ప్యాసింజరు, సిర్పూర్(టి) -భద్రాచలం సింగరేణి ప్యాసింజరు, సిర్పూర్(టి) -కరీంనగర్ పుష్పుల్, కాజీపేట్ -నాగ్‌పూర్ నాగ్‌పూర్ ప్యాసింజరులతో పాటు బల్లార్షా -సికింద్రాబాద్ భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్‌లు కొనసాగేవి. కరోనా సమయంలో 2020 మార్చి నుంచి నాగ్‌పూర్ -ఖాజీపేట్ నాగ్‌పూర్ ప్యాసింజరు రైలు, సికింద్రాబాద్ -బల్లార్షా భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు. అప్పటి నుంచి రద్దయిన రైల్లు పునఃప్రారంభం కాలేదు. సికింద్రాబాద్ - బల్లార్షా భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్‌ను పునఃప్రారంభిస్తామని రైల్వే అధికారులు చెప్పినప్పటికీ కాజీపేట్ -బల్లార్షా రైల్వే మార్గంలో థర్డ్‌లైన్ పనులు కొనసాగుతుండటంతో అంతరాయం వాటిల్లుతోంది. బల్లార్షా -నాగ్‌పూర్ లైన్‌లో నూతన లైన్ పనులు కొనసాగుతుండటంతో బల్లార్షా రైల్వేస్టేషన్‌లో భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ కొనసాగించేందుకు ఇబ్బందులు కలుగుతున్నాయని అందుకే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలు బల్లార్షా వరకు కాకుండా కాగజ్‌నగర్ వరకే కొనసాగిస్తున్నట్లు రైల్వే అధికారులు చెబుతున్నారు. రైల్వే ఉన్నతాధికారులు స్పందించి గతంలో కొనసాగించే రైళ్లను యథావిధిగా కొనసాగించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఒక్కరోజు రైళ్లు రద్దు

కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో థర్డ్‌లైన్ పనులు కొనసాగుతుండడంతో శుక్రవారం పలు రైళ్లు రద్దు చేసినట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు. సికింద్రాబాద్ నుంచి కాగజ్‌నగర్ వచ్చే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ బెల్లంపల్లి వరకు మాత్రమే నడిపారు. కాగా రామగిరి ప్యాసింజర్ రైలు, సింగరేణి రైలు, కరీంనగర్ పుష్పుల్ రైళ్లను పూర్తిగా రద్దు చేశారు. అయితే రాత్రి నుంచి కాగజ్‌నగర్ వరకు రైళ్ల కొనసాగింపు ప్రారంభమవ్వగా సిర్పూర్(టి) మీదుగా మహారాష్ట్ర రైళ్లు మాత్రం ప్రారంభం కాలేదు.

'కాంగ్రెస్‌తోనే రైతుల అభివృద్ధి'

కౌటాల: కాంగ్రెస్‌తోనే రైతుల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. శుక్రవారం కౌటాల మండల కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల హామీలో భాగంగా ధరణిని తొలగించి భూ భారతి చట్టం అమలులోకి తెచ్చారన్నారు. జెడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి, పార్టీ మండల కన్వీనర్లు నికోడే గంగారాం, ఉమా మహేశ్, నాయకులు భాస్కర్, గట్టయ్య, పోశం, విశ్వనాథ్, భగవంతం, కోటేశ్వర్ పాల్గొన్నారు.

జయంతి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రవీణ్‌కుమార్, సభ్యులు

కౌటాల: కాగజ్‌నగర్ పట్టణంలో శుక్రవారం బుద్ధుని జయంతి పోస్టర్లను బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు బుద్ధుడి మార్గంలో నడవాలన్నారు. బుద్ధుడి ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో మే 12న సిర్పూర్(టి) మండల కేంద్రంలోని నాగమ్మ చెరువులో గల బుద్ధుడి విగ్రహం వద్ద బుద్ధుడి జయంతి నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. నాయకులు నవీన్, ప్రశాంత్, దిలీప్, ప్రకాశ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కుప్పలు.. తిప్పలు.!



దహెగాం: కోత్మీర్ నుంచి మండల కేంద్రం వరకు డబుల్‌రోడ్డు పనులు ప్రారంభం కావడంతో కల్వర్టుల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. కల్వర్టుల నిర్మాణానికి అవసరమయ్యే కంకర, ఇసుక కుప్పలు రోడ్డుకు ఆనుకుని పోయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇసుక, కంకర రోడ్డుపైకి వస్తుండడంతో వాహనదారులు జారిపడిపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై కంకర, ఇసుక పోయకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చిత్ర యూనిట్‌కు సన్మానం



చిత్ర యూనిట్‌ను సన్మానిస్తున్న యువకులు

కౌటాల: జగమెరిగిన సత్యం సినిమా చిత్ర యూనిట్‌ను శుక్రవారం కాగజ్‌నగర్ పట్టణంలోని శ్రీ వెంకటరమణ థియేటర్‌లో యువకులు సన్మానించారు. వెంకటరమణ సినిమా థియేటర్‌లో శుక్రవారం జగమెరిగిన సత్యం సినిమాను రిలీజ్ చేయగా సినిమా వీక్షించడానికి వచ్చిన పెంచికల్‌పేట్ మండలం చేడ్వాయి గ్రామానికి చెందిన సినిమా దర్శకుడు పాలే తిరుపతి, సినిమా నిర్మాత విజయ్‌భాస్కర్‌ను యువకులు సన్మానించారు. కౌటాల, పెంచికల్‌పేట్, చింతలమానెపల్లి మండలంలోని దిందా ప్రాంతాల్లో జగమెరిగిన సత్యం సినిమాను చిత్రీకరించినట్లు దర్శకుడు తెలిపారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

సిర్పూర్(టి): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం, ప్రగతిభవన్‌లో శుక్రవారం సిర్పూర్(టి) మేజర్ గ్రామపంచాయతీ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఇన్‌చార్జి అధికారిణి దివ్యకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. గ్రామపంచాయతీ కార్మికులకు గత 15 నెలలుగా వేతనాలు రావడంలేదని, గ్రామపంచాయతీ అధికారులు స్పందించి వేతనాలు అందేలా చూడాలని, జిల్లా గెజిట్ ప్రకారం ఇతర గ్రామపంచాయతీల్లో వేతనాలు చెల్లిస్తున్నట్లు సిర్పూర్(టి) మేజరు గ్రామపంచాయతీలో వేతనాలు చెల్లించాలని కోరారు. మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, సిబ్బంది పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఇన్సూరెన్స్ విధానం పూర్తిగా అమలు చేయాలని, తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి పెరిక శ్రీకాంత్, గ్రామపంచాతీ సిబ్బంది భార్గవ్, బిక్షపతి, రాజన్న, లక్ష్మీ, రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే తనిఖీలు



మాట్లాడుతున్న సీఐ రమేశ్

జైనూర్: నేరాల నిర్మూలనకే నిర్బంధ తనిఖీలు చేపడుతున్నట్లు సీఐ రమేశ్ అన్నారు. శుక్రవారం సిర్పూర్(యూ) మండల కేంద్రంలోని సేవాదాస్ నగర్‌లో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నిర్బంధ తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నేరాల నియంత్రణకు సాయపడాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే వార్తలు నిజమో కాదో నిర్ధారించుకున్న తర్వాతనే పోస్ట్ చేయాలన్నారు. అనంతరం జైనూర్ ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన రవికుమార్‌ను అన్నాభావు సాఠే సంఘం ఆధ్వర్యంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిసున్న ఎస్సై కొమురయ్య

పెంచికల్‌పేట్: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కొమురయ్య అన్నారు. మండల కేంద్రంలోని వారసంతలో శుక్రవారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. వాట్సాప్‌లో వచ్చే తెలియని లింక్స్‌పైన క్లిక్ చేయవద్దని, ఫోన్‌లకు వచ్చే ఓటీపీలు ఎట్టి పరిస్థితుల్లో చెప్పొద్దన్నారు. మోసాలు జరిగితే వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ నేరాలను అరికట్టడానికి విస్తృతంగా ప్రచారం చేసి ప్రజల్లో చైతన్యం కలిగించాలని సూచించారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

వెదురు మొక్కలపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న డీపీఎం సారయ్య

కెరమెరి: వెదురు మొక్కలపై మహిళలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని డీపీఎం సారయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని మండల సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 13 నుంచి 15 గుంటల స్థలంలో వెదురు మొక్కలు నాటితే నాలుగేళ్ల తర్వాత ఏటా రూ.40 వేల వరకు ఆదాయం పొందవచ్చన్నారు. ప్రతీ మహిళా రైతుకు 60 మొక్కలు, సేంద్రియ ఎరువులు ఉచితంగా అందిస్తామని, ఈ విషయాన్ని వీవో సభ్యులు, సీసీ, వీవోఏలు మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం జగదీశ్వర్, సీఆర్‌పీలు ప్రీతి, క్రిష్ణవేణి, సీసీలు, వీవోఏలు ఉన్నారు.

మలేరియా సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కెరమెరి: మలేరియా వ్యాధి రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డా. రియాజ్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మురికి నీటిని నిల్వ ఉంచకుండా ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలన్నారు. నీరు నిల్వ ఉన్న చోట దోమలు, క్రిములు, కీటకాలు వృద్ధి చెంది మలేరియా వచ్చే అవకాశం ఉంటుందన్నారు. సూపర్‌వైజర్ మెస్రం సోము, ఎంపీహెచ్‌ఏ, ఏఎన్‌ఎంలు, సిబ్బంది ఉన్నారు.

జైనూర్: మలేరియా వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్యాధికారి ఉదయ్ కిరణ్ అన్నారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన ర్యాలీ నిర్వహించారు.


ప్రమాదవశాత్తు ట్రాక్టర్ దగ్ధం



కాలిపోతున్న ట్రాక్టర్

దహెగాం: వరిగడ్డి లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌కు ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి ట్రాక్టర్ దగ్ధమైన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధిత రైతు, స్థానికుల కథనం ప్రకారం.. కాగజ్‌నగర్ మండలంలోని బోడెపల్లి గ్రామానికి చెందిన కావుడె గోపాల్‌కు చెందిన ట్రాక్టర్‌లో శుక్రవారం దహెగాం మండల కేంద్రానికి చెందిన ఓ రైతు వద్ద వరిగడ్డి (పశుగ్రాసం) లోడ్ చేసుకున్నాడు. పొలంలో కరెంట్ వైర్లు కిందికి వేలాడుతున్న క్రమంలో విద్యుత్ తీగలకు లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ తగలడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ట్రాక్టర్‌లోని వరిగడ్డికి నిప్పంటుకోవడంతో గడ్డి, ట్రాక్టర్ పూర్తిగా దగ్ధమయ్యాయి.

మహిళ మృతదేహం లభ్యం



కేశాబాయి బిక్కు (ఫైల్)

లింగాపూర్: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన జాదవ్ కేశాబాయి బిక్కు (65) అనే మతిస్థిమితం లేని మహిళ మృతదేహం శుక్రవారం నిమ్మతండా గ్రామంలోని చేనులో లభ్యమైంది. వివరాల్లోకి వెళ్తే.. కేశాబాయి బిక్కుకు రెండేళ్లుగా మతిస్థిమితం లేకపోవడంతో ఆసుపత్రిలో చికిత్స చేయించారు. అయినా వ్యాధి తగ్గలేదు. ఈక్రమంలో ఈనెల 22 నుంచి ఆమె కన్పించడం లేదు. ఆమె కుమారుడు కరణ్‌సింగ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా శుక్రవారం ఆమె మృతదేహం నిమ్మతండా గ్రామంలో లభ్యమైంది. మృతికి గల కారణాలు తెలియరాలేదు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా:
9010608462
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్ :
తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : ..., S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899